సాక్షి
విజయనగరం
శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023



మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. - 8లో



పైడితల్లిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి - 8లో

పైడితల్లి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి కె.సురేష్ రెడ్డి దర్శించుకున్నారు.



రక్తమోడిన రోడ్లు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో వేర్వేరు ప్రదేశాల్లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందగా తొమ్మిది మంది గాయపడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

31న జిల్లాస్థాయి ఓపెన్ చెస్ పోటీలు

విజయనగరం: విజయనగరం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 31న జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి కె.వి.జ్వాలాముఖి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని రింగ్‌రోడ్‌లోని ఫైర్ చెస్ స్కూల్‌లో అండర్-7, 9, 11, 13, 15 వయస్సుల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతి కేటగిరీలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 30లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 97033 44488 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఓపెన్ వర్సిటీ ఫీజుల చెల్లింపునకు షెడ్యూల్ విడుదల

విజయనగరం అర్బన్: సార్వత్రిక విద్య పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు చెల్లించే ఫీజుల షెడ్యూలు విడుదల చేసినట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. వచ్చేనెల 5 నుంచి 19వ తేదీ వరకు అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చన్నారు. పదోతరగతి విద్యార్థులు ప్రతి సబ్జెక్టుకు రూ.100 చొప్పున, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలకు ప్రతి సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్ పరీక్షలకు ప్రతి సబ్జెక్టుకు రూ.100 చొప్పున ఫీజు చెల్లించాలన్నారు. ప్రతి ఒక్క సబ్జెక్టుకు రూ.25 అపరాధ రుసుంతో వచ్చేనెల 20 నుంచి 27వ తేదీ మధ్యకాలంలో చెల్లించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక సబ్జెక్టుకు రూ.50 చొప్పున అపరాధ రుసుంతో వచ్చేనెల 28 నుంచి మార్చి 3వ తేదీ వరకు గడువు ఉందన్నారు. తత్కాల్ రుసుముగా పదో తరగతికి రూ.500, ఇంటర్మీడియట్‌కు రూ.1,000 అవకాశం ఇస్తారని తెలిపారు.

మార్చి 18 నుంచి ఇంటర్మీయట్ పరీక్షలు

ఇంటర్మీడియట్ పరీక్షలను వచ్చేనెల 18 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తామని డీఈఓ తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్ ప్రయోగపరీక్షలు మార్చి 30 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్షల టైమ్ టేబుల్ పూర్తి వివరాలను 'ఏపీఓపెన్‌స్కూల్.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్ సైట్‌లో పొందుపరిచామన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: మండలంలోని తంపటాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.చాందిని, అల్లు దీక్షిత ఇటీవల హైదరాబాద్ టీఎస్ తెలుగు అకాడమీ యూనివర్సిటీలో జరిగిన ఆల్ ఇండియా ఆర్ట్స్ కాంపిటేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనపర్చారు. వీరిని హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. తిరుపతిలో జరిగిన తెలుగు వేమన పద్యంపై జరిగిన చిత్రలేఖనం పోటీల్లోనూ అల్లు దీక్షిత బహుమతులు సాధించిందన్నారు. కార్యక్రమంలో డ్రాయింగ్ ఉపాధ్యాయులు జి.మురళీ కృష్ణ, శ్రీనివాసరావు, జయిరావు, విమల కుమారి, జనార్దనరావు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

పార్వతీపురం: మాజీ సైనికులు, వితంతు మాజీ సైనికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా సైనిక బోర్డు సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మాజీ సైనికుల సంక్షేమం కోసం జిల్లా సైనిక బోర్డు పలు ప్రతిపాదనలు చేసిందన్నారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు మాట్లాడుతూ మాజీ సైనికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సైనిక బోర్డు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తోందన్నారు. సమావేశంలో సంఘ చైర్మన్ శ్రీరాములు, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్ పాల్గొన్నారు.

సాగు సాయం





వ్యవసాయ పంపు సెట్టు

- ఏటా రైతులకు వేలాది వ్యయసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు
- నాలుగున్నరేళ్లలో 19,620 కనెక్షన్లు
- జిల్లాలో మొత్తం అగ్రికల్చర్ కనెక్షన్లు 56,555
- 2019 నాటికి ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 36,935
- 9 గంటలపాటు నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా

విద్యుత్ కనెక్షన్లు మంజూరు ఇలా..

గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం జిల్లాలోని రైతులకు 19,620 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసింది. 2019 నాటికి జిల్లాలో 36,935 విద్యుత్ కనెక్షన్లు ఉండేవి. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనెక్షన్ల సంఖ్య 56,555కు పెరిగింది.

విజయనగరం ఫోర్ట్: పొలంలో ఆరుగాలం శ్రమించి అందరికీ అన్నంపెట్టే రైతన్నకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోంది. విత్తు దగ్గర నుంచి పంట కొనుగోలు వరకు అన్నింటా సహకారం అందిస్తోంది. ఏటా వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం చేస్తోంది. పండిన పంటను ప్రభుత్వమే మద్దతుధరకు కొనుగోలు చేస్తోంది. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలతో సాగుసూచనలు ఇప్పిస్తోంది. విపత్తుల సమయంలో రైతులను ఆదుకునేలా పంటల బీమాను ప్రభుత్వమే చెల్లిస్తోంది. మరోవైపు వ్యవసాయాధారిత భూముల్లో సాగు నీటికి ఆధారమైన వ్యవసాయ బోర్లు, బావులకు విద్యుత్ కనెక్షన్లను వేలాదిగా మంజూరు చేస్తోంది. రైతులకు ఇబ్బందిలేకుండా దరఖాస్తు చేసిన కొద్ది రోజుల్లోనే కనెక్షన్లు మంజూరు చేస్తూ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. ప్రతిరోజు 9 గంటల పాటు నిరంతరాయంగా పగటిపూట విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తూ రైతుల మన్ననలు అందుకుంటోంది. గత టీడీపీ పాలనలో రెండు పూటలు విద్యుత్ సరఫరా చేసేవారు. రాత్రి పూట పొలాలకు వెళ్లేందుకు రైతులు నానాపాట్లు పడేవారు. విషసర్పాల బారిన పడి తనువుచాలించేవారు. నాలుగున్నరేళ్లుగా రైతులకు ఆ కష్టాలు తప్పాయి.

2019 నుంచి 2023 నవంబర్ నెలఖారు వరకు మంజూరు చేసిన విద్యుత్ కనెక్షన్లు ఇలా..

సంవత్సరం	వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు
2019-20	2,027
2020-21	2,457
2021-22	11,001
2022-23	2,412
2023-24	1723

పగటిపూటే విద్యుత్ సరఫరా



రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా చేయాలన్నది ప్రభుత్వ ఆదేశం. అలాగే, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకున్న కొద్దిరోజుల్లోనే మంజూరు చేస్తున్నాం. రైతులకు పగటిపూటే 9 గంటల పాటు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం.

– ముప్వల లక్ష్మణరావు, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్

31న పశుసంవర్ధక శాఖ సహాయకుల పరీక్ష



పరీక్ష ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న డీఆర్వో ఎస్.డి.అనిత

- పకడ్బందీగా ఏర్పాట్లు: డీఆర్వో అనిత

విజయనగరం అర్బన్: జిల్లాలో ఈ నెల 31న నిర్వహించే పశు సంవర్ధకశాఖ సహాయకుల నియామక రాత పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత అధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఏర్పాట్లపై సమీక్షించారు. 31వ తేదీ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు 8 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. జిల్లాలో 13 ఖాళీలకు గాను సుమారు 1,120 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చీఫ్ సూపరింటెండెంట్‌లుగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను నియమించామన్నారు. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందని, అభ్యర్థులు తప్పనిసరిగా తమ బయోమెట్రిక్ నమోదు చేయాలని సూచించారు. ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా అడ్మిన్ కార్డు, ప్రభుత్వ గుర్తింపు కార్డులు తీసుకురావాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్‌తో సహా ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులు పరీక్షానంతరం రఫ్ షీట్లను ఇన్విజిలేటర్లకు అందజేయాలని సూచించారు. అవసరమైన వారికి నిబంధనలకు అనుగుణంగా స్క్రైబ్‌లను అనుమతిస్తామని చెప్పారు. పరీక్ష కేంద్రాలవద్ద తగిన పోలీస్ బందోబస్తు, ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ విశ్వేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, టీసీఎస్ అధికారులు, ఆయా పరీక్ష కేంద్రాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో రాణించిన పోలీస్ సిబ్బంది



పతకాలు సాధించిన వారిని అభినందిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాలోని రామాయపట్నంలో డిసెంబర్ 24, 25 తేదీల్లో నిర్వహించిన 43వ రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2023లో జిల్లా పోలీసులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఎం.దీపిక పతకాలు సాధించిన పోలీస్ సిబ్బంది, రిటైర్డ్ పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల పట్ల ఆసక్తి కలిగిన వారికి వయసుతో పనిలేదన్నారు. ఆసక్తి, సాధనతో మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో రాణించడం సంతోషకరమైన విషయన్నారు. జిల్లా పోలీస్ శాఖలో ఏఎస్ఐ, కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న త్రినాథరావు, వెంకటేశ్వరరావు, విశ్రాంత హెచ్‌సీలు శంకరరావు, దుర్గారావు ఎంతో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించడం గొప్ప విషయమని, వారి క్రీడాస్ఫూర్తి యువతకు ఆదర్శనీయమన్నారు. పతకాలు సాధించిన వారిని రూరల్ సీఐ టి.వి.తిరుపతిరావు, ఆర్ఐ టి.శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీ షర్టులు, క్యాప్‌లు

- జిల్లాలో 71వేల మంది క్రీడాకారులకు పంపిణీ
- మూడు రోజుల్లో 94 శాతం మ్యాచ్‌లు షెడ్యూల్ ప్రకారం పూర్తి
- ఆడుదాం-ఆంధ్రా పోటీలపై కలెక్టర్ నాగలక్ష్మి



విజయనగరం అర్బన్: జిల్లాలో ఆడుదాం-ఆంధ్రా పోటీలు మూడు రోజులుగా ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నట్టు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. క్రీడా పోటీల్లో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మూడు రోజుల్లో వివిధ జట్ల మధ్య నిర్వహించాల్సిన పోటీల్లో 94 శాతం పూర్తిచేశామన్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం 2,690 మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా, 2,531 మ్యాచ్‌లు పూర్తయ్యాయన్నారు. జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయం నుంచి మండల స్థాయికి ఎంపికైన జట్లకు పంపిణీ కోసం అన్ని మండలాలు, మున్సిపాలిటీలకు 71 వేల క్యాప్‌లు, అంతే సంఖ్యలో టీ షర్టులు సరఫరా చేశామని కలెక్టర్ వెల్లడించారు. క్రీడాకారులు పోటీల్లో పాల్గొనే సమయంలో వీటిని అందజేస్తారని పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో పాల్గొనే జట్లకు సర్టిఫికెట్లను అందజేస్తామని తెలిపారు. పోటీల నిర్వహణ జరుగుతున్న తీరును పరిశీలించే నిమిత్తం జేసీ మయూర్ అశోక్ గురువారం పలు మండలాల్లో పర్యటించి క్రీడల నిర్వహణను పరిశీలించారు.

జగన్‌తోనే భవిష్యత్తు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు (ఇన్‌సెట్లో) మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉంటేనే పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు అందడంతో పాటు రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. పింఛన్ల పెంపు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాల అమలు తదితర కార్యక్రమాల సన్నద్ధతలో భాగంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విజయనగరం కలెక్టరేట్ నుంచి ముత్యాలనాయుడుతో పాటు డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్‌బాబు, ఎమ్మెల్యేలు శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, పలువురు అధికారులు హాజరయ్యారు. అనంతరం ముత్యాలనాయుడు మీడియాతో మాట్లాడారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మల రుణాలను మాఫీ చేస్తానని ఇచ్చిన హామీని చంద్రబాబు తుంగలోకి తొక్కేశారని గుర్తు చేశారు.

రైతురుణాలను భేషరతుగా రద్దు చేస్తానని హామీ ఇచ్చి 2014 ఎన్నికల్లో గట్టెక్కిన చంద్రబాబు.. తర్వాత ఆ హామీ అమలుచేయకుండా రైతులను మోసం చేసిన తీరును ఎవరూ మరిచిపోలేదన్నారు. బీసీల సంక్షేమానికి ఏటా రూ.10వేల కోట్లు కేటాయిస్తానని చెప్పి... ఐదేళ్లలో కనీసం రూ.5 కోట్లు కూడా విదిల్చలేదని విమర్శించారు. అడ్డగోలు హామీలిచ్చి, ప్రజలను మోసం నాడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు చేతిలో అన్ని వర్గాలవారూ దగాపడ్డారన్నారు. ఏరు దాటిన తర్వాత తెప్ప తగలేసిన చందంగా, ఉన్నతస్థాయిలో కూర్చోబెట్టిన మామను ముఖ్యమంత్రి పీఠం కోసం వెన్నుపోటు పొడిచిన మాదిరిగా అన్ని వర్గాల ప్రజలనూ 2014 ఎన్నికల్లో వారి ఓట్లతో అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేశాడని గుర్తు చేశారు. ప్రజలకు ఇస్తున్న సంక్షేమ పథకాలను దండగ అన్న ఇదే పెద్దమనిషి ఇప్పుడు పగటివేషగాడిలా మాటమార్చి తానే మరింత పెంచి ఇస్తానంటూ కొత్త పల్లవి అందుకున్నాడని విమర్శించారు.

జగన్‌తో పోలికా?

తన సుదీర్ఘ పాదయాత్రలోను, 2019 ఎన్నికల సమయంలోనూ ప్రజలకు ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలుచేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో, ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు పోలికా అని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఎద్దేవా చేశారు. పైసా అవినీతికి ఆస్కారం లేకుండా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. అర్హత ఒక్కటే ప్రామాణికంగా పైసా అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలను అమలుచేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని అభినందించారు. జగనన్న అధికారంలో ఉంటేనే ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందని వివరించారు.

అంబేడ్కర్ ఆశయాలను చాటేందుకు...

బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను చాటేందుకు వీలుగా విజయవాడలో నిర్మించిన 125 అడుగుల భారీ విగ్రహాన్ని జనవరి 19న పండగ వాతావరణంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారని ఉపముఖ్యమంత్రి ముత్యాలనాయుడు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ప్రతి సచివాలయం నుంచి కనీసం ఐదుగురు చొప్పున హాజరయ్యేలా బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు.

సంతృప్తికరంగా సంక్షేమ పథకాలు

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమ పథకాలను సంతృప్తికర స్థాయిలో అమలుచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ముత్యాలనాయుడు చెప్పారు. సంక్షేమ క్యాలెండర్‌లో భాగంగా అంచెలంచెలుగా పెంచుతూ వచ్చిన సామాజిక పింఛన్ రూ.3 వేలు చొప్పున అవ్వాతాతలకు ఇచ్చే పండుగ వాతావరణం వచ్చేసిందన్నారు. జనవరి 1 నుంచి 8వ తేదీ వరకూ ఇప్పుడు ఇస్తున్న రూ.2,750కు అదనంగా రూ.250 మొత్తం రూ.3 వేలు చొప్పున పంపిణీ చేసే పింఛన్ల పండగ నిర్వహిస్తామని వెల్లడించారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేందుకు రూ.25వేల కోట్ల పైచిలుకు ఉన్న బ్యాంకు రుణాలను నాలుగు విడతల్లో మాఫీచేస్తామన్న హామీ మేరకు వైఎస్సార్ ఆసరా పథకం మూడు దఫాలు ఇప్పటికే అమలుచేసినట్లు గుర్తు చేశారు. ఆసరా నాలుగో దఫా కార్యక్రమం జనవరి 23వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని వెల్లడించారు. 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ చేయూత పథకం కింద ఏటా రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో రూ.75వేల ఆర్థిక సాయం చేస్తామన్న హామీ మేరకు ఇప్పటికే మూడు దఫాలు విజయవంతంగా అమలుచేసినట్లు చెప్పారు. నాలుగో విడత ఫిబ్రవరి 5వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమవుతుందని వెల్లడించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రజలకు స్ఫూర్తినిచ్చేలా వీడియో చిత్రాలు తీసేలా వలంటీర్లకు పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉత్తమ చిత్రాలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. వాటితో పాటు ఫిబ్రవరి 15, 16 తేదీల్లో సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులతో వలంటీర్లను సన్మాన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

అంతర్జాతీయ క్రీడల్లో రాణించాలి

- రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను ప్రారంభించిన డిప్యూటీ సీఎం రాజన్నదొర
- క్రీడలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట
- క్రీడావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు



వాలీబాల్ ఆటను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర

పాచిపెంట: గిరిజన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ఆటల పోటీల్లో సాధన చేయాలని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర సూచించారు. ఏ రంగంలోనూ తాము తక్కువ కాదని, పోటీతత్వంతో ముందుకు సాగాలని కోరారు. పాచిపెంట మండలం పి.కోనవలస గురుకుల పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించే రాష్ట్రస్థాయి గిరిజన క్రీడాపోటీలను గురువారం క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన 1100 మంది క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఆడుదాం ఆంధ్రా పోటీలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వం విద్యార్థుల చదువుకు అమ్మఒడి, జగనన్న విద్యాకానుకలు, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్యాదీవెన, జగనన్న గోరుముద్ద, నాడు-నేడు వంటి కార్యక్రమాలతో అండగా నిలుస్తోందన్నారు. మరోవైపు క్రీడాకారుల్లో ప్రతిభకు పదునుపెట్టేలా పోటీలు నిర్వహిస్తోందని చెప్పారు. క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. మూడు రోజులపాటు జరిగే క్రీడాపోటీలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజన విద్యార్థులకు భోజన, వసతిసదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలిగినా వెంటనే తనకు ఫోన్‌చేసి తెలియజేయాలన్నారు. అనంతరం ఎంపీపీ బడ్నాన ప్రమీల మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే మన గిరిజన బతుకులు బాగుపడుతున్నాయని, ఆ బతుకులు నిలబడాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆటల సంబరంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను అలరించాయి. డిప్యూటీసీఎం గిరిజన విద్యార్థులతో కలిసి థింసా నృత్యంచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొట్టేసి మంగమ్మ, ఎంపీటీసీ సభ్యుడు తోకల లక్ష్మి, వైస్ ఎంపీపీ నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



గిరిజన బాలికలతో కలిసి థింసా నృత్యం చేస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

ఏక్‌భారత్- శ్రేష్ఠ భారత్ బృందానికి వీడ్కోలు



ఏపీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావును సత్కరిస్తున్న కేంద్రీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి

విజయనగరం అర్బన్: ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్ యువ బృందం సభ్యులకు గిరిజన విశ్వవిద్యాలయం అధికారులు గురువారం వీడ్కోలు పలికారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (న్యూఢిల్లీ) మార్గదర్శకత్వంలో దాదాపు 45 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ నెల 21 నుంచి రాష్ట్రంలో వారంరోజుల పాటు పర్యటించారు. పర్యాటకం, సంప్రదాయం, అభివృద్ధి, సాంకేతికత ప్రజల మధ్య అనుసంధానం, ప్రాంతీయ వైవిధ్యం, వారసత్వాన్ని పరిశీలించారు. పర్యటనలో భాగంగా ఉత్తరాంధ్రలోని పలు ప్రదేశాలను సందర్శించారు. వీరికి వీడ్కోలు కార్యక్రమం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు మాట్లాడుతూ యువబృందంను వర్సిటీ విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సలహాదారుడు డాక్టర్ రవీంద్రకుమార్ సోనీ మాట్లాడుతూ విద్యార్థులు తమ సృజనాత్మకతను వెలికితీసేందుకు దేశ వ్యాప్తంగా జరుగుతున్న విశేషమైన సాంకేతిక, అభివృద్ధి పురోగతులను దృష్టిలో ఉంచుకొని ఇలాంటి అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. గిరిజన యూనివర్సిటీ విద్యార్థులతో పాటు బృంద ప్రతినిధులు నిర్వహించిన సాంస్కృతిక, సంప్రదాయ నృత్యాలు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో సీతం ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బొత్సఝాన్సీలక్ష్మి, డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరిచేనుకు నిప్పు



కాలిపోయిన వరిచేనును వేరుచేస్తున్న రైతులు

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడు పేటకు చెందిన రైతు గండ్రేటి రాముకు సంబంధించిన వరిచేను గురువారం కాలిపోయింది. కోసిన పంటను పొలంలోనే కుప్పగా వేయగా, అక్కడి విద్యుత్ స్తంభంపై ఓ పక్షి వాలడంతో, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి, చేనుకు నిప్పంటుకుంది. అప్రమత్తమైన అక్కడి రైతులు మంటలు ఆర్పివేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఆ వరికుప్ప అంతా కాలి బూడిదైంది.

రెండు బైక్‌లు దగ్ధం

- పెట్రోల్‌పోసి తగలబెట్టిన దుండగులు
- ఆందోళనలో దత్తి గ్రామస్తులు




దత్తి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి కాల్చేసిన బైక్‌లు

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ దత్తి గ్రామంలో ఒకేవీధిలో వేర్వేరు ఇళ్లవద్ద పార్కింగ్ చేసిన రెండు ద్విచక్రవాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి పెట్రోల్‌పోసి కాల్చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు గ్రామానికి చెందిన పెదిరెడ్ల వెంకటరావు, పెదిరెడ్ల అప్పారావు ఎప్పటివలే తమ ఇళ్లముందు బైక్‌లను పార్కింగ్ చేశారు. రాత్రి సమయంలో నిద్రలోకి జారుకున్నారు. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడడం, పెట్రోల్ వాసన రావడంతో నిద్రలేచి చూడగా బైక్‌లు మంటల్లో కాలిపోవడాన్ని గుర్తించి వెంటనే ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే బైక్‌లు దగ్ధమయ్యాయి. బాధితులు కొత్తవలస పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుమేరకు విచారణ జరుపుతున్నట్టు ఎస్‌ఐ హేమంత్‌కుమార్ తెలిపారు.


గ్రూప్ -2 అభ్యర్థులకు ఉచిత శిక్షణ

విజయనగరం గంటస్తంభం: ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్ – 2 పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ప్రభుత్వం ఉచిత శిక్షణ అందిస్తోంది. బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో స్థానిక కస్పా హైస్కూల్‌లో శిక్షణ తరగతులను జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి కె. సందీప్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్ మాట్లాడుతూ, అభ్యర్థులు శిక్షణ తరగతులను వినియోగించుకుని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. తొలి విడతలో భాగంగా 80 మంది శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమంలో సహాయ బీసీ వెల్ఫేర్ అధికారులు యశోదరావు, రాజులమ్మ, స్టడీ సర్కిల్ ఇన్‌చార్జి పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

రాజాం సిటీ: పాలకొండ మండలంలోని బాసూరు గ్రామానికి చెందిన 21 ఏళ్ల వివాహిత అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేశామని సీఐ కె.రవికుమార్ తెలిపారు. ఈ నెల 26వ తేదీన రాజాం జీఎంఆర్ కేర్‌కు తన అత్తతో కలిసి వచ్చిందని, అక్కడ నుంచి తన అత్తతో చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయిందన్నారు. ఆమె తండ్రి ఆలుగుబిల్లి బంగారునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఆస్పత్రిలో బెల్లాన పైడిరాజు మృతదేహం

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి వద్ద భవనం పైనుంచి జారిపడి తీవ్రగాయాలపాలైన బెల్లాన పైడిరాజు(58) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. విజయనగరం జిల్లా, గాజులరేగ రాళ్ల వీధికి చెందిన పైడిరాజు కొట్టక్కి వద్ద జరుగుతున్న భవన నిర్మాణ పనులకు ఎప్పటిలాగే బుధవారం ఉదయం వెళ్లాడు. భవనం మూడో అంతస్తులో పనిచేస్తుండగా, ప్రమాదవశాత్తు కిందపడి గాయాలపాలయ్యాడు. స్థానికుల సహకారంతో చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి అతడిని తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ రాత్రి ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి భార్య బెల్లాన కుమారి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సురేంద్రనాయుడు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. రోజువారీ కూలీగా పనిచేస్తూ కుటుంబ పోషణ చేస్తున్న ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹200

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- జనవరిలో కొత్తగా 4వేల పింఛన్లు
- పింఛన్ మొత్తం రూ.3వేలకు పెంపు
- రాష్ట్రవిద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



గుర్ల: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ



గుర్ల: కోటగండ్రేడు సచివాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

గుర్ల: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మండలంలోని కోటగండ్రేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రాలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలోని మహిళలకు నాలుగేళ్లలో రూ.కోటి 30 లక్షల నగదును వివిధ సంక్షేమ పథకాల రూపంలో ప్రభుత్వం అందజేసిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదల ఇంటి వద్దకు వైద్యులను పంపించి వైద్యసేవలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని జనవరి నెలలో ఏర్పాటుచేస్తామన్నారు. జనవరి నెల నుంచి మూడు వేల పింఛన్ నగదు అందిస్తామని తెలియజేశారు. జిల్లాలో కొత్తగా 4వేల మందికి జనవరి నెలలో పింఛన్లు మంజూరు చేస్తామని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డి నడుస్తూ రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని, అటువంటి ప్రభుత్వాని మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గ్రామానికి అవసరమైనా అభివృద్ధి పనులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో 100 మందికి ఇళ్ల పట్టాలను అందజేశారు.

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ నాయకులు ఆల్‌ఫ్రీ సంక్షేమ పథకాలు అని గ్రామాల్లో తిరుగుతారని, అటువంటి వారిని నమ్మి మోస పోవద్దని ప్రజలకు హితవుపలికారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేసి

ప్రజారోగ్యానికి పెద్దపీట

- ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు
- రూ.1.11 కోట్లతో నిర్మించిన అర్బన్ పీహెచ్‌సీ భవనం ప్రారంభం



అర్బన్ పీహెచ్‌సీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీసీఎం, జిల్లా ఇన్‌చార్జిమంత్రి బూడి ముత్యాలనాయుడు, తదితరులు

నెల్లిమర్ల: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విజయనగరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో రూ.1.11 కోట్లతో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన అర్బన్ పీహెచ్‌సీ భవనాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు)తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీసీఎం మాట్లాడుతూ పట్టణ ప్రాంత ప్రజలకు సైతం పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందించే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టణంలో ఆరోగ్యకేంద్రాలను ప్రారంభించిందన్నారు. ఆయా కేంద్రాలకు అవసరమైన అధునాతన పరికరాలను సమకూర్చడంతో పాటు సొంతభవనాలను నిర్మించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా 10 పడకల ఆస్పత్రి భవనాన్ని, ల్యాబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ గౌరీశంకర్, మౌలికసదుపాయాల సంస్థ డీఈ సత్యప్రభాకర్, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు ఎస్.రామారావు, కె.వి.కృష్ణారావు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, నగర పంచాయతీ పార్టీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, పార్టీ మండలాధ్యక్షుడు చనుమల్లు వెంకటరమణ, నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, నగర పంచాయతీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, సర్పంచ్ ముద్దాడ ప్రసన్న కుమారి, ఎంపీటీసీ సభ్యుడు ఉబ్బిశెట్టి అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రక్తమోడిన రోడ్లు

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి
- తొమ్మిదిమందికి గాయాలు



అరకు-విశాఖ రోడ్డులో తుమ్మికాపల్లి గేటు సమీపంలో లారీ ఢీకొట్టడంతో మృతి చెందిన పూలమొక్కల వ్యాపారి రామారావు

కొత్తవలస: ఉమ్మడి విజయనగరం జిల్లాలో వేర్వేరు ప్రదేశాల్లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందగా తొమ్మిదిమంది గాయపడ్డారు. అరకు–విశాఖ రోడ్డులో కొత్తవలస మండలం తుమ్మికాపల్లి గేటు సమీపంలో విశాఖ నుంచి ఫ్లైయాష్ లోడ్‌తో వెళ్తున్నలారీ ఢీకొనడంతో తూర్పు గోదావరి జిల్లా వలమూరు మండలానికి చెందిన రామారావు(58) మృతి చెందాడు. మృతుడు సైకిల్‌పై పూలమొక్కలను తీసుకెళ్లి స్థానికంగా అమ్మకాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మొక్కల అమ్మకాలు పూర్తిచేసుకుని సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. లారీ డ్రైవర్ కొత్తవలస పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అరకు అందాలు చూసివస్తూ...





అరకు-విశాఖ రోడ్డులో నిమ్మలపాలెం కూడలి మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు భాను (ఫైల్) (ఇన్‌సెట్‌లో)భాను(ఫైల్)

ఇద్దరు స్నేహితులు బైక్‌పై అరకువెళ్లి అక్కడి అందాలను తిలకించారు. తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురై ఒక యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గాజువాక సమీపంలోని మింది గ్రామానికి చెందిన యువకులు తేజ, భానులు ద్విచక్రవాహనంపై అరకు విహారయాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నిమ్మలపాలెం కూడలి మలుపు వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ ట్రాక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టారు. దీంతో అక్కడికక్కడే తేజ(23) మృతిచెందగా, భాను గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వైద్యంకోసం 108 వాహనంలో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీస్‌లు తెలిపారు.

కొత్తవలస-విజయనగరం రోడ్డులో...

కొత్తవలస–విజయనగరం రోడ్డులో విజయనగరం వైపు నుంచి వచ్చిన లారీ ఆదే రూట్‌లో వచ్చిన స్కూటీని బలంగా ఢీకొట్టింది. దీంతో స్కూటీపై ప్రయాణిస్తున్న కుమ్మరి బంజీరికి చెందిన యువకులు చాకచక్యంగా తప్పించుకున్నారు. స్కూటీని సుమారు 10 మీటర్ల వరకు లారీ ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో.. ఇద్దరికి గాయాలు



గాయపడిన వ్యక్తిని 108లో తరలిస్తున్న సిబ్బంది

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో గురువారం ఉదయం బైక్‌ను ఆటో ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గజపతినగరం నుంచి పెదమానాపురం వస్తున్న ఆటో చినచామాలాపల్లి నుంచి గజపతినగరం వెళ్తున్న బైక్‌ను ఢీకొనడంతో ఆటోలో ఉన్న శివకు, బైక్‌ను డ్రైవింగ్ చేస్తున్న పైడిరాజుకు గాయాలయ్యాయి. ఇద్దరినీ 108లో గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించినట్టు పెదమానాపురం ఎస్‌ఐ శిరీష తెలిపారు.

కారు-బొలెరో ఢీ..

- నలుగురికి గాయాలు



కారులో క్షతగాత్రులను ఎక్కించే ఏర్పాట్లు చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: విజయనగరం జిల్లా బొండపల్లి మండల కేంద్రానికి సమీపంలో గురువారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న కారు–బొలెరో వ్యాన్‌లు బలంగా ఢీకొనడంతో నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. దత్తిరాజేరు మండలంలోని ఒక ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని అదే మార్గంలో విజయనగరం వెళ్తున్న గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య వెంటనే కారుదిగి ఘటనా స్థలానికి చేరుకున్నారు. 108కు సమాచారం ఇచ్చి వెంటనే గాయపడిన ఇద్దరిని 108లోను, మరో ఇద్దరిని తన కారులో జిల్లా కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి సూపరింటెండ్‌తో మాట్లాడి క్షతగ్రాతులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. గాయపడిన వారిలో మురసాల బుజ్జి ఒకరుకాగా, మరోముగ్గురి వివరాలు తెలియాల్సి ఉంది. బొండపల్లి ఎస్‌ఐ రవి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పైడితల్లిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి



విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న హైకోర్టు జడ్జి సురేష్ రెడ్డి



నెల్లిమర్ల రూరల్: హైకోర్టు జడ్జి సురేష్ రెడ్డి దంపతులకు ఆశీర్వచనాలు అందిస్తున్న అర్చకులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి కె.సురేష్ రెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం హైకోర్టు జడ్జికి వేదపండితులు వేదాశీస్సులు, అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సుధారాణి పాల్గొన్నారు.

రామతీర్థంలో..

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామిని హైకోర్టు జడ్జి కంచిరెడ్డి సురేష్‌రెడ్డి దర్శించుకున్నారు. సతీ సమేతంగా ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, అధికారులు ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమ్య, ఈఓ కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

15 బస్తాల ధాన్యం అపహరణ

రేగిడి: మండలంలోని కొర్లవలస గ్రామంలో 15 బస్తాల ధాన్యం గురువారం అపహరణకు గురయ్యాయి. గ్రామానికి చెందిన బంకి నర్సునాయుడు బుధవారం రాత్రి కల్లం వద్ద ఉన్న దొరచెరువు గట్టుపై 41 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించేందుకు సిద్ధం చేసి, ఉంచాడు. గురువారం కల్లం వద్దకు చేరుకుని, చూడగా ధాన్యంబస్తాల్లో 15 బస్తాలు కనిపించలేదు. దీంతో బాధిత రైతు లబోదిబోమంటూ సర్పంచ్ బంకి చంద్రశేఖర్ సాయంతో రేగిడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిత్యుని సన్నిధిలో నిర్మాత నట్టికుమార్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సినీ నిర్మాతల సంఘం ప్రతినిధి, ప్రముఖ నిర్మాత నట్టికుమార్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం


జామి: మండలంలోని ఎం.కె.వలస గ్రామంలో ఎస్.సూరిబాబు అక్రమంగా ఉంచిన 83 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ జి.వీరబాబు తెలిపారు. ఆయనపై కేసు నమోదు చేశామన్నారు.

8 మద్యం బాటిళ్ల స్వాధీనం

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట మీదుగా అక్రమంగా తరలిస్తున్న 8 మద్యంబాటిళ్లను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. సంకిలికి చెందిన ఓ వ్యక్తి ఈ బాటిళ్లను తీసుకువెళ్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి, బాటిళ్లను సీజ్ చేశామన్నారు.

గ్యాస్‌లీకేజీ ఘటనలో మరొకరు మృతి


- నాలుగుకు చేరిన మృతుల సంఖ్య



చికిత్స పొందుతూ మృతి చెందిన బాలుడు మోహన్‌రావు

లక్కవరపుకోట: లక్కవరపుకోటలోని గవరవీధిలో గ్యాస్‌సిలిండర్ పేలిపోయి ఇల్లు కూలిపోయిన ఘటనలో మృతుల సంఖ్య నలుగురికి చేరింది. మిగిలిన ఒక్కచిన్నారి పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. గతనెల 19వ తేదీన గ్యాస్ సిలిండర్ పేలిపోయి స్లాబ్ ఇల్లు కూలిపోయిన ఘటనలో ఇద్దరు మహిళలు, ముగ్గురు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు కె.మోహన్‌రావు(11) బుధవారం రాత్రి మృతి చెందినట్టు ఎస్‌ఐ ముకుందరావు తెలిపారు. కాగా, ఇప్పటికే ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కె.లాస్య (8) ఈ నెల 11న, మరో మహిళ కె.శ్రావణి (30) ఈనెల 7న మృతిచెందారు. తామరాపల్లి వెంకటలక్ష్మి(50) గతనెల 29న మృతి చెందారు. వీరందరూ ఒకే కుంటుంబానికి చెందినవారు. ప్రమాదంలో గాయపడిన మిగిలిన ఒక చిన్నారి ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు పోలీసులు తెలిపారు. గాయపడిన వారు ఒక్కొక్కరూ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యుల్లో విషాదం అలముకుంది.

ఉత్సాహంగా ఆటల పోటీలు



పురుషుల పరుగు పందెం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైన అంతర పాలిటెక్నిక్ ఆటల పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల మైదానంలో క్రీడలు గురువారం కొనసాగాయి. పోటీలను సాంకేతిక విద్యా శాఖ డీడీ రామకృష్ణ, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జానకి రామయ్య పర్యవేక్షించారు. మహిళల రిలే పరుగులో మౌనిక, ఝాన్సీ, రజిని, లావణ్య (వెంకటేశ్వర) మొదటి స్థానం సాధించారు. 200 మీటర్ల పురుషుల పరుగు పందాల్లో చంద్రయ్య (టీపీఆర్), మహిళల్లో హరిత (టీపీఆర్) మొదటి స్థానాలు సాధించారు. 400 మీటర్ల పరుగులో మహిల్లో మౌనిక (వెంకటేశ్వర), భార్గవ జీపీటీ మొదటి స్థానాల్లో నిలిచారు. 100 మీటర్ల పరుగులో పురుషుల్లో హర్షవర్ధన్ (వెంకటేశ్వర), మహిళల్లో మౌనిక (వెంకటేశ్వర) విజేతలుగా నిలిచారు. జావెలిన్ త్రో విలియం (వెంకటేశ్వరావు), నాగరాజు (వెంకటేశ్వర), ఇర్ఫాన్ (జీపీటీ) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. 400-100 పురుషుల రిలేలో ఢిల్లీశ్వర రావు, నాగరాజు, యశ్వంత్, అభికిషన్ (వెంకటేశ్వర) మొదటి స్థానంలో నిలిచారు. 400-400 రిలే పురుషుల్లో హేమంత్, రాజేష్, ఫణీంద్ర, సాయికుమార్ (ఐతం) మొదటి స్థానంలో నిలిచారు. షాట్‌పుట్ పురుషుల్లో నాగరాజు (వెంకటేశ్వర), మహిళల్లో దుర్గాప్రశాంత (వెంకటేశ్వర)మొదటి స్థానంలో నిలిచారు. 800 మీటర్ల పరుగు పందెంలో పురుషుల్లో గోపీ (సీతంపేట), మహిళల్లో ఆకర్షణ(జీపీటీ) మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. 1500 మీటర్ల పరుగు పురుషుల్లో శ్యామ్(వెంకటేశ్వర) మొదటి స్థానం సాధించారు.

రూ. 1.70 కోట్లతో రామారాయుడు రోడ్డు అభివృద్ధి



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి , తదితరులు

- అభివృద్ధి పనులు ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం:

అన్ని రంగాల్లో నగర అభివృద్ధే ధ్యేయంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో విస్తరణ పేరిట ప్రతిపాదించి చేతులెత్తేసిన మార్గాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో పనులు పూర్తి చేసి నగర ప్రజలు సుఖమయంగా ప్రయాణం సాగించేలా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా స్థానిక ఎంఆర్ కళాశాల జంక్షన్ నుంచి ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వరకు గల రామారాయుడు రోడ్డు అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గురువారం శ్రీకారం చుట్టారు. రూ.1.70 కోట్లతో చేపట్టనున్న పనులను మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్, తదితరులు మాట్లాడుతూ.. నగరానికి వ్యాపార కూడలిగా ఉన్న రామారాయుడు రోడ్డును అభివృద్ధికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ముందుకు రావడం అభినందనీయమన్నారు. కోలగట్ల వీరభద్రస్వామి శాసనసభ్యుడిగా నగరానికి ఎంత అభివృద్ధి చేయాలో అంతకన్నా ఎక్కువగా చేసి చూపించారని కొనియాడారు. మరోసారి కోలగట్లను గెలిపించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఆర్. శ్రీరాములునాయుడు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ రుక్మిణి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు కేదారిశెట్టి లక్ష్మణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.